
# ఫ్లాష్ బ్యాక్



**పాతసినిమాలకు సంబంధించిన విశేషాలు.. నటీనటుల గురించి, సినిమాల గురించి, సాంకేతిక నిపుణుల గురించి.. వగైరా..వగైరా. ప్రతినెలా ఓసారి అలనాటి సినీరంగంలోకి తొంగిచూద్దాం**

## దర్శకుడిగా రంగారావు

### (1968, ఆగస్టు విజయచిత్ర నుంచీ పునర్ముద్రణ)



"ఒక గొప్ప ప్రబంధం వుంది. దాన్ని పండితుడికిస్తే, తన శక్తినిబట్టి అందులో వున్న సారాంశాన్ని గ్రహిస్తాడు! మామూలుగా చదువుకున్న వాడికిస్తే అతనూ అర్ధం చేసుకుంటాడు. అయితే, పండితుడికి అర్ధమయ్యేంతగా అర్ధం కాకపోవచ్చు. కాస్త చదువు మాత్రమే గల వ్యక్తికి ఇస్తే కొంతవరకే అర్ధం చేసుకోగలుగుతాడు. అయితే, ముగ్గురూ వాళ్ళ జ్ఞానాన్ని బట్టి, శక్తినిబట్టి – ఆ గ్రంధాన్ని అర్ధం చేసుకుంటారు. అలాగే చలన చిత్రం కూడా. చలన చిత్రాన్ని అంతా ఒక్క దృష్టితోనే చూడదు! ఒక్కలాగే అర్ధం చేసుకోదు. ప్రేక్షకులు వారి వారి తత్వాలనుబట్టి అర్ధం చేసుకుంటారు. అయితే, చిత్రం అందరికీ పనికొచ్చేదిగా, అందరికీ అర్ధమయ్యేదిగా వుండాలి. ఉన్నప్పుడే ఆ చిత్రం జనరంజకం కాగలదు" అన్నారు నటుడు, డైరెక్టర్ యస్. వి. రంగారావు. 'చదరంగం' దర్శకుడిగా, రంగారావుకు మొదటి చిత్రం! 'బాంధవ్యాలు' రెండో చిత్రం. "రెండు చిత్రాల అనుభవంతోనూ నేను చాలా తెలుసుకున్నాను" అన్నారు రంగారావు.

"ముఖ్యంగా దర్శకుడికి కావలసినది – నమ్మకం. తన మీద తనకు నమ్మకం కుదరాలి! వుండాలి. పరిశీలన, వూహా – అవసరం. నటుడికి కూడా ఇవే అవసరం. అయితే దర్శకుడికి – వీటితో బాటు ఇంకా కొన్ని అర్హతలు కావాలి.

ప్రేక్షకులకు ఏది అందించాలి? ఎంతవరకూ అందించాలి? అని తెలుసుకోవడం దర్శకుడికి చాలా అవసరం. చిత్రానికి కథ ఆయువుపట్టు. ఆ కథను తెరమీద చెప్పడంలోనే ఇబ్బంది వుంది. పాత్రల అవసరాన్నీ దృశ్యాల అవసరాన్ని తెలుసుకుంటూ కథను నడిపించడం దర్శకుడి ముఖ్యమైన బాధ్యత అని నేను అనుకుంటాను. దర్శకుడి నైపుణ్యం కూడా అందులోనే కనిపిస్తుంది.

నాకు రకరకాల షాటును, రకరకాల కోణాల్లో తియ్యడం మీద నమ్మకంలేదు; టెక్నికల్ గా చెప్పడంలో నమ్మకం లేదు. సామాన్య ప్రేక్షకుడికి కూడా సులభంగా అర్థమయ్యేలా కథ చెప్పడం అవసరం. ఏదో ఒక తరగతి ప్రేక్షకులు ఆదరిస్తారనీ, వారికోసం కావాలనీ — ఏవేవో పద్ధతులు చిత్రాల్లో ప్రవేశపెట్టరాదు. నా అభిరుచులూ, నా దృష్టీ వేరు కావచ్చు. నా వూహలూ, నా ఐడియాలూ వేరు కావచ్చు. వాటిని తీసుకొచ్చి చిత్రాల్లో ప్రవేశపెట్టడం మంచి పద్ధతి కాదని నా అభిప్రాయం. చలన చిత్రం సకలజనరంజకంగా వుండాలన్నదే నా నమ్మకం. అందుకనే నేను కుటుంబ గాధలనే చిత్రాలకు కథలుగా ఎన్నుకుంటాను. నిన్నటి నా 'చదరంగం' నేటి నా 'బాంధవ్యాలు' కూడా కుటుంబ గాథలే. అవి, అందరికీ నచే కథలు, అందరూ మెచ్చే కథలూ.

నా కేదో, 'క్లాస్ థాటు' వున్నాయని, నా చిత్రాల్లో కూడా అవే వుంటాయని భావించడం పొరబాటు. నా 'థాట్' నావి. నా ఉద్దేశాన్నీ నా అభిప్రాయాన్నీ చెప్పడం కాదు చిత్రం అంటే. ఎటువంటి వ్యక్తయినా, చిత్రరంగంలోకి దిగేటప్పుడు — ప్రజలకు అందరికీ అర్దమయ్యేలా చిత్రాన్నీ నిర్మించడమే శ్రేయస్కరమైనది. ఏ కొద్ది మందికో మాత్రమే అర్ధమయ్యేట్టు చిత్ర నిర్మాణం చెయ్యడం తగదని నా అభిప్రాయం.

ప్రేక్షకులు చిత్రంలో లీనం కావాలి. 'ఇదేమిటి?' అని ఎక్కడా అనిపించనివ్వకూడదు. పాటకోసం అని పాట, హాస్యం కోసం అని హాస్యం వుంచడం నేను ఎంత మాత్రం ఒప్పుకోను. పాటలూ, హాస్యమూ చిత్ర కథలో అంతర్గతంగా ఐక్యమై రావాలి. అలాగే, చిత్రాల్లో 'సెక్స్' దృశ్యాలను చూపడం కూడా నేను అంగీకరించను. సెక్స్ కోసం సెక్స్ దృశ్యాలను జొప్పించడం, ఆ విధంగా ఆ దృశ్యాల్లో మితిమీరడం నేను ఇష్టపడను. సెక్స్ అనేది — చూసే చూపులో వస్తుంది! నవ్వే నవ్వులో వస్తుంది. అలా రావాలే గాని, తొడలు చూపితే రాదు. పాత్రకు వుండే ఔచిత్యాన్ని పాటించకుండా సెక్స్ చూపితే ఎవరూ సహించరు. 'బాంధవ్యాలు' చిత్రంలో — ఒక పాత్ర జీన్స్ వేసుకుని, నృత్యం చేస్తుంది. అయితే అది కథకు ఎలాంటి అవసరమో, ఆ పాత్ర ఎలాంటిదో చూసేవారే అర్థం చేసుకోగలుగుతారు.

చిత్రంలో వచ్చే పాత్రలకు పాత్రధారులను నిర్ణయించడంలో కూడా దర్శకునికి ప్రజ్ఞ వుండాలి. పాత్రధారుల నిర్ణయంలో తప్పటడుగుపడితే, రాణింపుకు అవకాశం వుండదు. నా అనుభవంలో నేను తెలుసుకున్న విషయం ఇంకోటి వుంది. చిత్ర దర్శకుడికి నటనా పరిజ్ఞానం బాగా వుండాలి. తానుగా నటించి చూపడం, అవతలవారు చేసిన దాంట్లో

లోపం ఎక్కడుందో కనిపెట్టడం వగైరాలు దర్శకుడికి అవసరం. 'ఇలా కావాలి' అనడం కన్న – 'ఇది కావాలి' అని చెప్పగలిగితే, నటించేవారికి తేలిక అవుతుంది. అయితే దర్శకుడికి అని టెక్నిక్ల తోనూ పరిచయం కూడా బాగా వుండాలని నేను తెలుసుకున్నాను." అన్నారు రంగారావు.

రంగారావుగారికి చాలా కాలం నుంచి చిత్రాన్ని డైరక్టు చెయ్యాలన్న ఉత్సాహం వుంది. తాను చిత్రాల్లో ధరించిన వివిధ పాత్రల నిర్వహణా, కథా రచనలో ఆయనకు వున్న నేర్పూ – ఆయన వూహకు మరింత బలం కలిగించాయి.

"సినిమా తియ్యాలన్న కోరిక కలిగినప్పుడు, నాలో వున్న భావాలకు ఇంకొకరికి చెప్పి 'ఇలా వుండాలి' అనేకంటే, నేనే స్వయంగా చేసుకుంటే ఎలా వుంటుంది? దాని వల్ల ఇంకొకరికి బాధలేదు. అందులో వుండే తప్పో, ఒప్పో నేనే అనుభవిస్తాను గదా – అనే దర్శకత్వాన్ని చేపట్టాను.

అనేక చిత్రాల్లో అనేక పాత్రలను ధరించడం, అనేక మంది దర్శకుల దగ్గర పని చెయ్యడం మొదలైన అనుభవాలు నాకు సహాయపడ్డాయి. పెద్ద దర్శకులందరి దగ్గరా పని చెయ్యడంతో వారి వారి విధానాలను గమనిస్తూ, వాటికి నా వూహలను జోడిస్తూ దర్శకత్వాన్ని నిర్వహించాను.

అయితే దర్శకత్వం అన్నది సులభమైన విషయం కాదు. రంగంలోకి దిగినంతసేపూ, అది తేలికయిన విషయంగా ఎవరికైనా తోచవచ్చు గాని, అందులోకి దిగితేగాని దర్శకత్వంలో వున్న సాధక బాధకాలు అర్థం కావు. దర్శకుడు అష్టావధానం చెయ్యాలి. చెయ్యడానికి విసుక్కో కూడదు. ఓర్పూ కావాలి, నేర్పూ కావాలి!

అయితే, దర్శకుడే – చిత్రంలో నటించడం వల్ల కొన్ని ఇబ్బందులున్నాయి. చదరంగం, బాంధవ్యాలు రెండు చిత్రాల్లోనూ నేను ముఖ్యపాత్రలు ధరంచాను. నేను కూడా నటించే దృశ్యంలో దర్శకుడిగా, అవతల నటుని గమనించడం అన్నది సాధ్యం కాదు. సాధ్యం చేసుకుంటే – ధరిస్తున్న పాత్ర మీద ధ్యేయం తగ్గుతుంది. ధ్యేయం తగ్గడం వల్ల, పాత్ర పోషణలో నిండుదనం, బరువూ తగ్గుతాయి. అయినా సరే, నా పాత్రను నేను పోషించుకుంటూ, నా పాత్రలో నేను లీనమై వుంటూనే, అవతల పాత్రధారిని గమనించడం చేసేవాడిని. ఆ పాత్ర మాట్లాడే తీరును వినేసరికే, ఆ భావం ఎలా వుంటుందో చెప్పవచ్చు. అలా కనిపెట్టేవాడిని. అయితే, అక్కడే ఇబ్బంది అంతా వుంది – రెండింటి మీదా ఒకే సారి దృష్టిని కేంద్రీకరించి, దర్శకుడి పాత్రనూ, మామూలు పాత్రనూ రెంటినీ ఒకేసారి నిర్వహించడంలో వున్న 'కష్టం' ఎలాంటిదో చెప్పడం కష్టం.

చిత్రానికి నేను దర్శకుణ్ణి కాబట్టి, ప్రతి పాత్రా౧ నేను చేసినట్టుగానే చెయ్యాలని నేను శాసించను. అది మంచి పద్ధతి కానే కాదు. 'నా ఉద్దేశం ఇది' అని చెప్పి – అవతలవారిని. వారి విధానంలో చెయ్యమంటాను. అంతేగాని, నన్ను 'కానీ' చెయ్యడానికి నేను ఇష్టపడ్డను.

నటుడు చిత్రాన్ని డైరెక్టు చేస్తే — ఏ పాత్రా వృధాగా పోయినట్టు కనిపించదు. పాత్రధారలు బాగా నటించడానికి అవకాశం వుంటుంది అని నా భావన. అయితే, వున్నది చిన్న పాత్రే అయినా పాత్రకు బలం వుండాలి. వుంటే నిలబడేట్టు చెయ్యగలడు దర్శకుడు." అన్నారాయన.

"మీరు ఇక ముందు దేనిమీద ఎక్కువ శ్రద్ధ వహిస్తాడు? నటన మీదా? దర్శకత్వం మీదా ?" అన్న ప్రశ్నకు సమాధానం ఇస్తూ ఆయన — ఇలా అన్నారు.

"చిత్రల్లో నటించడం ఎన్నడూ మానను. అది నా ముఖ్యవృత్తి. దర్శకత్వం వహించడం వల్ల నా నటనావృత్తికి ఏ విధమైన ఆటంకం కలగడం లేదు. కలగకుండా వుండేట్టుగానే, నేను ఏర్పాటు చేసుకుంటున్నాను. అంచేత, భావిలో కూడా చిత్రాలు డైరక్టు చేస్తాను. మా సంస్థ 'చదరంగం' చిత్రాన్ని తమిళంలో నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నది. దానికి నేనే దర్శకత్వం వహిస్తాను. పోతే 'బాంధవ్యాలు' తర్వాత, తెలుగు చిత్ర నిర్మాణానికి కథలను పరిశీలిస్తున్నాము. కథ నిర్ణయం అయితే తెలుగు చిత్రాన్ని కూడా ఆరంభిస్తాము. అదీ నేనే డైరక్టు చేస్తాను.

అయితే, నేను సాంఘికచిత్రాలు మాత్రమే డైరక్టు చేస్తావా — పురాణాలూ, జానపదాలూ డైరక్టు చెయ్యవా అని అడుగుతున్నారు. ప్రేక్షకులకు అన్ని రకాల చిత్రాలూ కావాలి. కథ బాగుంటే ఏముంది? ఏ చిత్రమైనా డైరక్టు చెయ్యవచ్చు. అయితే, పురాణచిత్రం డైరక్టు చెయ్యడమే సులభం అని నా ఉద్దేశం. ఎంచేతంటే, ఆ పాత్రలకు ఒక పద్ధతి అంటూ ఏర్పాటయ్యే వుంది. ఆ పద్దతి అనుసరించవలసిందే గాని, ఇంకో పద్దతి అవలంభించరాదు. సాంఘిక చిత్రాన్ని డైరక్టు చెయ్యడమే కష్టం. నిత్యజీవిత పరిశీలన, అవగాహన, వాతావరణ కల్పన — మొదలైనవి ఎన్నో అవసరం. సాంఘిక చిత్రానికి అవన్నీ పాటించాలంటే, దర్శకుడు అయా వాతావరణంలో సాన్నిహిత్యం కలిగించుకోవాలి. అసలు దర్శకత్వంలోనే 'ఇబ్బంది' అన్నది వున్నప్పుడు — సాంఘిక చిత్రం అయితేనేం — ఏ చిత్రం అయితేనేం ? — ' అని ప్రశ్నించారు రంగారావు — దర్శకుడిగా.

COMMENTS